క్లుప్తంగా

రోడ్డెక్కిన వారపు సంత



అంబాజీపేటలో ప్రధాన రహదారి పక్కన వెలసిన మాంసం, కూరగాయల మార్కెట్

అంబాజీపేట: పూర్వం నుంచి ఎంతో ఘన చరిత్ర ఉన్న అంబాజీపేట శివారు కొర్లపాటివారిపాలెంలో బుధవారం నిర్వహిస్తున్న వారపు సంత రోడ్డెక్కింది. మేజర్ పంచాయతీ అయిన మాచవరంలో సేకరించిన చెత్త, చెదారాన్ని వేసేందుకు డంపింగ్ సమస్య నెలకొన్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగానే గత రెండు వారాలుగా సంత నిర్వహించే ప్రాంతంలో చెత్త, మాంసం, చేపల వ్యర్థాలను తొలగించకపోడంతో దుర్వాసన వెదజల్లుతుంది. తిరిగి వారపు సంత నిర్వహిస్తే చెత్త, వ్యర్థాలు పేరుకుపోతాయనే ఉద్దేశంతో స్థానికులు మార్కెట్‌లోకి ఎటువంటి దుకాణాలు వేయకుండా పాలెంలోకి వెళ్లే రహదారులను మూసి వేశారు. దాంతో స్థానిక మార్కెట్ యార్డు సమీపంలో మాంసం, కూరగాయలు, గంగలకుర్రు మలుపు వద్ద బెల్లం, కూరగాయలు, డైలీ మార్కెట్‌లో చేపల మార్కెట్‌లను నిర్వహించారు. ఇదిలా ఉండగా ఒక్క కరోనా సమయంలోనే వారపు సంతను నిర్వహించలేదు. పూర్వం నుంచి ఎంతో పేరు ప్రఖ్యాతులున్న వారపు సంత బుధవారం తొలిసారిగా నిలిచిపోయిందని స్థానికులు, వ్యాపారులు చెబుతున్నారు.

వ్యక్తిపై కేసు

అయినవిల్లి: స్థల వివాదం నేపథ్యంలో గాయపర్చిన వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం తొత్తరమూడి పెదపాలెం గ్రామానికి చెందిన కాండ్రేగుల మోహన్‌కృష్ణను అదే గ్రామానికి సమీప బంధువు కుడుపూడి వెంకటేశ్వరరావు ఇంటి స్థలం వివాదం నేపథ్యంలో గాయపరిచాడన్నారు. దీనిపై బాధితుడు మోహన్‌కృష్ణ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తైక్వాండో మాస్టర్ అబ్బులుకు అభినందనలు

ఆలమూరు: కుంగ్‌ఫూ, కరాటే, మార్షల్ ఆర్ట్స్ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభను కనబర్చి ఎందరో విద్యార్థులకు శిక్షణను ఇస్తున్న తైక్వాండో మాస్టర్ టి.అబ్బులుకు అభినందనలు వెల్లువెత్తాయి. రాష్ట్ర వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి బుధవారం జొన్నాడ పర్యటనకు విచ్చేసిన సందర్భంగా మాస్టర్ అబ్బులు మర్యాదపూర్వకంగా తన విద్యార్థులతో శాప్ చైర్మన్ బైరెడ్డితో కలిశారు.

రేపటి నుంచి జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాలు

పి.గన్నవరం: రేపటి నుంచి జరగనున్న జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పార్టీ శ్రేణులకు సూచించారు. దీనికి సంబంధించిన పోస్టర్లను బుధవారం మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయం వద్ద చిట్టిబాబు విడుదల చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా మా నమ్మకం నువ్వే జగన్ అంటున్నారని తెలిపారు. జగన్ నాలుగేళ్ల పాలనలో సాధించిన విజయాలను, అమలు చేసిన సంక్షేమ పథకాలను, ప్రజలకు కలిగిన ప్రయోజనాలను, అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. గత ప్రభుత్వానికి, మన ప్రభుత్వానికి తేడాలను ప్రజలకు తెలియజేయాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఆశీర్వదించాలని చిట్టిబాబు ప్రజలను కోరారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొమ్ముల రాము, సర్పంచ్‌లు తోలేటి బంగారునాయుడు, వడలి కొండయ్య, కొంబత్తుల ఏసు, రాష్ట్ర నాయకులు దొమ్మేటి శివరామన్, యన్నాబత్తుల ఆనంద్, కుంపట్ల గోవిందరావు, గుత్తుల నాగబాబు, సాధనాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చిన్ననాటి స్నేహితులకు సాయం

తాళ్లరేవు: స్థానిక శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–86 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు రోళ్ల చక్రవర్తి, దంగేటి రాంబాబు, అన్నామణి తదితరులు గోల్డెన్ గ్రూపుగా ఏర్పడి చిన్ననాటి తమ మిత్రులకు సాయం అందించారు. కోరంగిలో అద్దె ఇంట్లో నివాసముంటున్న వాతాడి లక్ష్మికి రూ.25 వేల విలువజేసే ఫర్నీచర్, నిత్యావసర వస్తువులను బుధవారం అందజేశారు. వాతాడి లక్ష్మితో పాటు మోర్త డేవిడ్ రాజులకు ప్రతి నెలా రూ.1,000 చొప్పున అందిస్తామని హామీ ఇచ్చారు.

పోలేరమ్మా.. కాపాడమ్మా..

రాయవరం: చెల్లూరులో పోలేరమ్మ అమ్మవారి తీర్థం బుధవారం ఘనంగా నిర్వహించారు. తమ పిల్లా పాపలను, పాడి పంటలను, పశుపుకుంకాలను చల్లగా చూడాలని కోరుతూ భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం రాత్రి అమ్మవారికి జాతరను వైభవంగా నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. సర్పంచ్ పాలిక రాఘవగోవిందు, ఉపసర్పంచ్ బుద్దాల రాంబాబు, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీ. తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కొత్తపేటలో దో మినార్

- రూ.18 లక్షల దాతల సహకారంతో మసీదు ఆధునీకరణ
- ఉమ్మడి జిల్లాకే తలమానికంగా 2 మినార్ల నిర్మాణం



కొత్తపేటలో ఆధునీకరించిన మసీదు ప్రార్థన హాలు

కొత్తపేట: ఆకాశాన్ని తాకాయా? అన్నట్టు స్థానిక కమ్మిరెడ్డిపాలెం మసీదు వద్ద రెండు మినార్లు కనువిందు చేస్తున్నాయి. నిన్నటి వరకూ అది సాధారణ మసీదు. నేడు ఆ మసీదు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకే తలమానికంగా నిలిచింది. అనేకమంది స్థానిక, స్థానికేతర ముస్లింల ఆర్థిక సహకారంతో సుమారు రూ.18 లక్షలతో రెండు మినార్లతో పాటు మసీదును సుందరంగా ఆధునీకరించారు. ఉమ్మడి జిల్లాలోనే కాక, రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా సుందరీకరించిన ఈ కమ్మిరెడ్డిపాలెం మసీదు పుట్టుపూర్వోత్తరాలు ఇలా ఉన్నాయి. పూర్వం ఆ ప్రాంతంలో మొట్టమొదట కమ్మృద్దీన్ అనే ముస్లిం కుటుంబం నివాసం ఉండేదట. ఆ కుటుంబంతో పాటు పలు ముస్లిం కుటుంబాలు ఉద్యోగం, ఉపాధి రీత్యా ఇక్కడికి వచ్చాయి. ఆ వ్యక్తి పేరున ఈ ప్రాంతానికి కమ్మృద్దీన్‌పాలెంగా పేరొచ్చింది. కాలక్రమేణా అది కమ్మిరెడ్డిపాలెంగా మారిందని పెద్దలు చెప్పేవారు. ఇదిలా ఉండగా ఆ ప్రాంతంలో నివాసం ఉండే ముస్లింలు ప్రార్థనల నిమిత్తం సుమారు 150 సంవత్సరాల క్రితం బాబాజాన్ అనే ముస్లిం పెద్ద చిన్న షెడ్డు నిర్మించారు. కొన్నేళ్లకు ఆయన అల్లుడు లాల్ సాహెబ్, ఆయన కుమారుడు షేక్ మస్తాన్ షరీఫ్ ఆ షెడ్డును బంగాళా పెంకుతో ఆధునీకరించారు. అప్పటి వరకూ అది ఆ కుటుంబం అధీనంలోనే ఉండగా తరువాత గ్రామ ముస్లిం పెద్దలు స్వాధీనం చేసుకుని మసీదు నిర్మించారు. కాలక్రమేణా ముస్లిం జనాభాకు అనుగుణంగా ప్రార్థనలకు అనువుగా లేకపోవడంతో తదనంతర ముస్లింల ఆధ్వర్యాన ఆధునీకరించారు. ఆ తరువాత కొన్నేళ్లకు మసీదు అభివృద్ధి కమిటీ ఏర్పడగా ఆ కమిటీ సభ్యులు ఈ మసీదును ఆధునీకరించి వివిధ సౌకర్యాలు కల్పించారు.

దో మినార్‌లతో సుందరీకరణ

ఇప్పుడు తాజాగా షేక్ మక్బుల్ ఆధ్వర్యంలో మసీదు కమిటీ ప్రెసిడెంట్ బడేమియాబాబు, షాదీఖానా ప్రెసిడెంట్ షేక్‌గౌస్ తదితరుల ఆధ్వర్యంలో స్థానిక, స్థానికేతర ప్రాంతాల్లో ముస్లింలు, ముస్లిం పెద్దల నుంచి సుమారు రూ.18 లక్షలు విరాళాలు సేకరించి మసీదును ఆధునీకరించారు. ముఖ్యంగా 100 అడుగుల ఎత్తులో రెండు మినార్లు (దో మినార్) నిర్మించారు. మసీదును, మసీదులో ప్రార్థనా మందిరాన్ని రంగులతో, లైటింగ్‌లో సుందరీకరించారు. వజ్రాసనంలో కూర్చుని ప్రార్థనలు చేసుకోవడానికి వీలుగా కొత్తగా మ్యాట్స్ ఏర్పాటు చేశారు. మినార్లతో పాటు మసీదు బయట, లోపల



కాంతులీనుతున్న నూతనంగా నిర్మించిన మినార్లు

మిరుమిట్లు గొలిపే రంగు రంగుల విద్యుదీకరణ సీరియల్ సెట్లతో అలంకరించారు. ప్రస్తుతం రంజాన్‌మాసం సందర్భంగా ఈ మసీదు కొత్త సుందరీకరణ, విద్యుత్ కాంతులతో విశేషంగా ఆకర్షిస్తుంది.

> **ఉమ్మడి జిల్లాలోనే ఎత్తైన మినార్లు**
>
> 
>
> సుమారు 150 ఏళ్ల క్రితం చిన్న షెడ్డులో ఏర్పడిన మసీదు మూడు తరాల ముస్లిం పెద్దల ఆధ్వర్యంలో అంచలంచెలుగా అభివృద్ధి చెందింది. తాజాగా నేడు అనేక మంది స్థానిక, స్థానికేతర ముస్లింల సహకారంతో అద్భుతమైన మసీదుగా ఆధునీకరించుకున్నాం. దీనిలో ఒక హిందువు ఆర్థిక సహకారం కూడా ఉంది. హైదరాబాద్‌లోని చార్మినార్ దేశంలోనే ప్రసిద్ధ కట్టడమైతే తాజాగా కొత్తపేటలో నిర్మించిన 'దో మినార్' (రెండు మినార్లు) ఈ రాష్ట్రానికే తలమానికం. 100 అడుగుల ఎత్తైన మినార్లు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనే కాదు, బహుశా నాకు తెలిసి ఈ రాష్ట్రంలోనే ఎక్కడా లేవు. మసీదు సుందరీకరణకు ఆర్థిక సహకారం చేసిన వారందరికీ మసీదు, షాదీఖానా కమిటీలు, స్థానిక ముస్లింల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.
>
> – షేక్ గౌస్, ప్రెసిడెంట్, షాదీఖానా కమిటీ, కొత్తపేట

నేడు ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రారంభం

అంబాజీపేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రోగ్రాంను తొండవరం సచివాలయం వద్ద గురువారం ఉదయం ప్రారంభించనున్నట్లు మండల వైద్యాధికారి వి.గౌతమి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మిలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు.

చిన్నారులకు టీకాలు వేయించాలి

అంబాజీపేట: పుట్టిన బిడ్డ నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని సీహెచ్‌ఓ బి.అప్పారావు అన్నారు. నందంపూడిలో సార్వత్రిక వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చిన్నారులకు సీజనల్ వారీగా టీకాలు వేయించుకునేలా వారి తల్లిదండ్రులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఆత్రేయపురం వీఆర్‌ఏపై కేసు

ఆత్రేయపురం: గ్రామానికి చెందిన వీఆర్‌ఏపై బుధవారం సాయంత్రం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు. వివరాలు ప్రకారం ఆత్రేయపురం వీఆర్‌ఏ వారా ప్రకాష్ అదే గ్రామానికి చెందిన ఆశ వర్కర్‌తో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కలెక్టర్ చొరవతో శ్లాబ్ కల్వర్టు నిర్మాణం

ప్రజలకు తీరనున్న వరద కష్టాలు



అప్పనపల్లిలో తొట్టి వంతెన స్థానే నిర్మిస్తున్న పక్కా వంతెన

మామిడికుదురు: తొట్టి వంతెన స్థానే పక్కా శ్లాబ్ కల్వర్టు నిర్మించాలని దశాబ్దాల నుంచి లంక గ్రామాల ప్రజలు చేస్తున్న డిమాండ్ ఎట్టకేలకు సాకారమవుతుంది. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చొరవతో శ్లాబ్ కల్వర్టు నిర్మిస్తున్నారు. మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు దిగువన అప్పనపల్లి ఉచ్చులవారిపేట మార్గంలో పాటురేవుపై పక్కా వంతెన నిర్మిస్తున్నారు. బ్రిటీష్ వారి హయాంలో నిర్మించిన తొట్టి వంతెన ఒక మాదిరి వరదకే ముంపుబారిన పడి అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు చెందిన ప్రజలు ఏటా తీవ్రమైన ముంపు సమస్యను ఎదుర్కొనే వారు. గత ఏడాది గోదావరి వరదల సమయంలో ఇక్కడి పరిస్థితిని స్వయంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా లంక గ్రామాల ప్రజల కష్టాలను స్వయంగా పరిశీలించారు. అప్పట్లోనే పక్కా వంతెన నిర్మాణానికి స్పష్టమైన హామీ ఇచ్చారు. దానికి అనుగుణంగా ఈ వేసవిలో వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. పక్కా వంతెన నిర్మాణం బాధ్యతను జాతీయ రహదారుల విభాగం అధికారులకు అప్పగించి శరవేగంగా పనులు నిర్వహించే విధంగా కార్యాచరణ చేపట్టారు. దీనిలో భాగంగా తొట్టి వంతెనను సమూలంగా తొలగించి దాని స్థానే శ్లాబ్ కల్వర్టు నిర్మాణం చేపట్టారు. ఈ శ్లాబ్ కల్వర్టు నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా రెండు వైపులా ఫిల్లర్లు ఏర్పాటు చేశారు. ఇక కల్వర్టుపై భాగంలో శ్లాబ్ పనులు జరుగుతున్నాయి. శ్లాబ్ నిర్మాణానికి సంబంధించి ప్రస్తుతం శ్లాబ్ వేస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి మొత్తం పనులను పూర్తి చేసే విధంగా పనులు నిర్వహిస్తున్నారు. ఈ శ్లాబ్ కల్వర్టు నిర్మాణం వల్ల అప్పనపల్లి, పెదపట్నం లంక, బి.దొడ్డవరం గ్రామాల ప్రజలకు ముంపు సమస్య నుంచి విముక్తి లభిస్తుంది. ఒక వేళ గోదావరికి భారీ వరద వచ్చిన సందర్భంలో మాత్రమే శ్లాబ్ కల్వర్టు ముంపుబారిన పడుతుంది. ఒక మాదిరి వరదకు తట్టుకునే విధంగా అధునాతనంగా ఈ శ్లాబ్ కల్వర్టు నిర్మిస్తున్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా కృషి ఫలితంగా శ్లాబ్ కల్వర్టు నిర్మాణానికి నోచుకుందని లంక గ్రామాల ప్రజలకు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

దేశంలో ఎక్కడా లేని విధంగా పథకాల అమలు



సఖినేటిపల్లిలో ఆసరా నమూనా చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లాంటి వ్యక్తి వల్లనే పథకాలన్నీ అమలవుతున్నాయని, ఇటువంటి పథకాలు దేశంలో మరెక్కడా కూడా లేవని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. రాష్ట్రానికి ఇటువంటి ముఖ్యమంత్రి జగన్ రాకపోతే ఏ పథకం కూడా ప్రజల వద్దకు వచ్చేది కాదని ఆయన నొక్కిచెప్పారు. బుధవారం సఖినేటిపల్లి సమతా కల్యాణ మండపం వద్ద ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలను ఎంపీడీవో జి.భీమారావు నిర్వహించారు. ఈ సభలో మూడో విడత 1244 సంఘాల్లోని 12,440 ఆసరా పథకం లబ్ధిదారులకు రూ.9,93,96,520 నమూనా చెక్కును ఎమ్మెల్యే మహిళలకు అందజేశారు. అలాగే సీఎం జగన్ చిత్రపటం వద్ద డ్వాక్రా మహిళలు, ప్రజాప్రతినిధులతో కలసి ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ, సీఎం జగన్ మోహన్‌రెడ్డి మరో పర్యాయం అధికారంలోకి వస్తే పేదల జీవితాలు బాగుపడతాయని, ఇప్పుడు రాష్ట్రంలో అమలవుతున్న పథకాలన్నీ కూడా యథావిధిగా అమలవుతాయని ఆయన తెలిపారు. జెడ్పీటీసీలు దొండపాటి అన్నపూర్ణ, మట్టా శైలజ, వైస్ ఎంపీపీ–1, 2 రాపాక దీవెనకుమారి, రుద్రరాజు చిన రాజా, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు గొల్లమందల చిట్టిబాబు, పరిషత్ కో ఆప్షన్ మెంబర్ బళ్ళ నోబుల్ ప్రభాకర్, వెలుగు ఏపీఎం అజయ్, మహిళ సమాఖ్య అధ్యక్షురాలు జిల్లెళ్ళ రోజా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన



నేదునూరులో లబ్ధిదారుకి పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన అందిస్తున్నారని, మరలా రాష్ట్ర ప్రజలంతా జగన్‌కు సంపూర్ణ మద్దతు పలుకుతారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. బుధవారం అయినవిల్లి మండలం నేదునూరులో గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో నిర్వహించారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఇంటింటికీ తిరిగి ప్రజలను కలసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిట్టిబాబు మాట్లాడుతూ జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ పాలనతోనే రాష్ట్రం అభివృద్ధి వైపు ప్రయాణం సాగిస్తుందన్నారు. ఎన్ని ఒడిదొడుకులు వచ్చిన ప్రజలకు సంక్షేమ పథకాలు ఆగవన్నారు. ఇచ్చిన మాటకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉంటారన్నారు. మరిన్ని సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చూడుతోందన్నారు. గ్రామంలో డ్రెయిన్లు, రహదారులు నిర్మించాలని ఎమ్మెల్యేను స్థానికులు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, నేదునూరు పీఏసీఎస్ అధ్యక్షుడు చిలువూరి సాయిరాజు, కామన కృష్ణమూర్తి, కుడుపూడి సత్యనారాయణ, కుసుమ సునీల్‌కుమార్, మట్టపర్తి వెంకటరమణ, జోగిబాబ్జి, గుత్తుల నాగబాబు, శీలం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా స్వామి వార్ల చక్రస్నానం

అంబాజీపేట: కె.పెదపూడిలో వేంచేసిన పార్వతీ సమేత మేనకేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామా సమేత కృష్ణరాయుడు స్వామి వార్ల కల్యాణంలో భాగంగా బుధవారం స్వామి వార్లకు చక్రస్నానాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు కొత్తలంక బుజ్జి ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆన్‌లైన్‌కు దీటుగా విక్రయాలు



అంబాజీపేటలో బైక్‌పై ఎండు చేపలు విక్రయిస్తున్న భైరవస్వామి

అంబాజీపేట: నేటి ఆన్‌లైన్ వ్యాపార రోజుల్లోనూ ఇంటింటికి తిరిగి నాణ్యమైన ఎండు చేపలను వినియోగదారులకు విక్రయిస్తూ ఆదాయం పొందడం విశేషం. పి.గన్నవరం మండలం లంకల గన్నవరానికి చెందిన మల్లాడి భైరవస్వామి తన బైక్‌కు ప్రత్యేకంగా గూడు తయారు చేయించుకుని దానిలో నాణ్యమైన ఎండు చేపలు, రొయ్యలను ఇంటింటికీ తిరిగి విక్రయిస్తున్నాడు. ఎనిమిదేళ్ల క్రితం వారపు సంతలలో ఎండు చేపలను విక్రయించే వాడినని, మార్కెట్‌లో దుకాణాలు పెరిగిపోవడంతో ఇంటింటికీతిరిగి అమ్ముకుంటున్నానన్నాడు. ఇలా చేయడం వల్ల వ్యాపారం బాగానే సాగుతుందని భైరవస్వామి తెలిపాడు.

బైరెడ్డికి ఘన స్వాగతం

ఆలమూరు: పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, శాప్ అధ్యక్షుడు బైరెడ్డి సిద్దార్థరెడ్డికి మండలంలోని జొన్నాడలో బుధవారం ఘన స్వాగతం లభించింది. మండపేట పర్యటనకు విచ్చేసిన ఆయనకు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ కట్టా శ్రీనివాసు, ఉప సర్పంచ్ నాండ్ర నాగమోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణరెడ్డి తదితరులు బైరెడ్డికి ఘన స్వాగతం పలికారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకుని స్థానిక ముఖద్వారం వద్ద నెలకొల్పిన విగ్రహానికి ఎమ్మెల్యే జగ్గిరెడ్డితో కలసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పార్టీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, పీఏసీఎస్ అధ్యక్షుడు తాడి మెహెర్ ఆదిత్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే జొన్నాడకు చెందిన సామాజిక వేత్త రేలంగి రాంబాబు తన అనుచరులతో కలసి పార్టీలో చేరారు. పార్టీలో చేరిన సుమారు 200 మంది కార్యకర్తలకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.



జొన్నాడలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులలు అర్పిస్తున్న బైరెడ్డి, జగ్గిరెడ్డి

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి జాతర

అంబాజీపేట: మాచవరంలో వేంచేసియున్న మహాలక్ష్మి అమ్మవారి జాతరను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జాతరలో పూజాఘటాలతో పాటు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఆలయ ప్రాంగణం వద్ద గురువారం తీర్థం ఏర్పాటు చేయనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అరిగెల నాగబాబు, నారిన శ్రీనివాసరావు తెలిపారు.

దేశం గర్వించదగిన నేత జగ్జీవన్‌రామ్



ఖండ్రిగలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



లక్కవరంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే వరప్రసాదరావు



అమలాపురంలో బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: దేశం గర్వించదగిన నేత బాబూ జగ్జీవన్‌రామ్ అని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు శ్లాఘించారు. జగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకుని అమలాపురం కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో చిట్టిబాబు పాల్గొన్నారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దళిత కుటుంబంలో పుట్టి అంచెలంచెలుగా ఎదిగి అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకున్న జగ్జీవన్‌రామ్‌ను నేటి తరం నేతలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈదరాడలో జరిగిన జయంతిలో ఎంపీపీ కుసుమ వనజకుమారి, సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి, దేవస్థానం చైర్మన్ యెరుబండి శ్రీరామమూర్తి, చేట్ల సత్యనారాయణ, కుసుమ పెరుమాళ్లకుమార్ పాల్గొన్నారు. మామిడికుదురు బస్టాండ్ కూడలిలో జరిగిన జగ్జీవన్‌రామ్ జయంతిలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, టీడీపీ నేతలు, జనసేన నేతలు పాల్గొన్నారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను ప్రస్తుతించారు.

జగ్జీవన్‌రామ్ ఆశయాలకు యువత కృషి చేయాలి

అంబాజీపేట: దేశ మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు నేటి తరం యువత కృషి చేయాలని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఉభయగోదావరి జిల్లాల గ్రీవెన్స్ విభాగం కన్వీనర్ పేరి శ్రీనివాస్, పార్టీ నాయకుడు కొండేటి వికాస్ అన్నారు. జగ్జీవన్‌రామ్ 117వ జయంతి సందర్భంగా అంబాజీపేట బస్టాండ్ వద్ద పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నాగవరపు నాగరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఉందుర్తి నాగబాబు, నేదునూరి ఏసు తదితరుల ఆధ్వర్యంలో బుధవారం బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు, స్థానిక బస్టాండ్ వద్ద జనసేన నాయకులు, మాచవరం పంచాయతీ వద్ద సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, కుసుమ శ్రీను, కుడుపూడి సత్తిబాబు, కుసుమ వెంకటేష్, కోట సత్తిబాబు, సూదాబత్తుల రాము తదితరులు పాల్గొన్నారు. అన్ని జెడ్పీ హైస్కూళ్ల వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు.

బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

మలికిపురం: స్థానిక పూలే, అంబేడ్కర్ భవనం వద్ద, లక్కవరం, విశ్వేశ్వరాయపురం గ్రామాల్లో బుధవారం అభిమానులు బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కాగా లక్కవరంలో అరుంధతీ యువజన సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో ముస్కూడి భాస్కరరావు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో కేఎస్ఎన్ రాజు, విష్ణుమూర్తి రాజు, సర్పంచ్ కె.పుష్పకుమారి, డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల బ్రహ్మాజీ, నల్లి శివకుమార్, మంగెన నరసింహారావు, గెడ్డం ఫిలిప్‌రాజు, కె.అశోక్ పాల్గొన్నారు. మలికిపురం పూలే, అంబేడ్కర్ భవనం వద్ద జరిగిన కార్యక్రమంలో గెడ్డం తులసీ భాస్కరరావు, చింతా ప్రసాద్, రొక్కాల వెంకట్, మురళి పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు జగ్జీవన్‌రామ్

కొత్తపేట: దళిత జాతి ఉద్ధరణకు పాటుపడిన మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ చిరస్మరణీయుడని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. మండలంలోని ఖండ్రిగ పలుసుగంటివారిపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో సీఎం జగన్ దళితుల అభ్యున్నతికి అనేక పథకాలు అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ నాయకుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి, సర్పంచులు దూనబోయిన వనదీప, రెడ్డి చంటి, ఎంపీటీసీ సభ్యురాలు పితాని రామతులసి తదితరులు పాల్గొన్నారు. కొత్తపేట మండల పరిషత్ కార్యాలయంలో జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎంపీపీ మార్గన గంగాధరరావు, పలువురు నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పంట నమోదు రైతుల జాబితా ప్రదర్శన

కపిలేశ్వరపురం: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని 17 రైతు భరోసా కేంద్రాల్లో 2022–23 రబీ పంట నమోదు చేయించుకున్న రైతుల జాబితాను ఆయా కేంద్రాల్లో ప్రదర్శించినట్టు మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ బుధవారం తెలిపారు. 15,882 ఎకరాలకు చెందిన 11,033 మంది రైతులు తమ పంటను నమోదు చేయించుకున్నారన్నారు. 13 గ్రామాల్లోని 618 ఎకరాల పంట పెండింగ్‌లో ఉందని తెలిపారు. నేలటూరులో 7.11 ఎకరాల్లోనూ, వల్లూరులో 59.03, వడ్లమూరులో 0.96, కాలేరులో 14.82, నల్లూరులో 34.04, వెదురుమూడిలో 2.37 ఎకరాల్లో ఈకేవైసీ నమోదు పెండింగ్‌లో ఉందన్నారు. అంగరలో 8.5, పడమర ఖండ్రికలో 8.45, తాతపూడిలో 70.49, కపిలేశ్వరపురంలో 98.49, మాచరలో 224.23, వాకతిప్పలో 86.46, కోరుమిల్లిలో 3.39 మొత్తం 618.34 ఎకరాల్లో ఈకేవైసీ నమోదు పెండింగ్‌లో ఉందని ఏఓ తెలిపారు.